జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

శనివారం | 21-6-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 375 పేజీలు: 4 వెల: రూ.7



# ఈవో గారు.. మీరు సూపర్!



*** ఈవోగా ప్రసాద్ బాధ్యతలు తీసుకున్న వెంటనే చర్యలు * అరసవల్లి ఆలయంలో ప్రక్షాళనకు అడుగులు * సిబ్బందిని గాడిలో పెట్టే పనికి శ్రీకారం * ఆలయాభివృద్ధికి, భక్తులకు సౌకర్యాల కల్పనకు పెద్దపీట * ఇకపై భక్తులకు నిత్యం స్వామి వారి అంతరాలయ దర్శనం * ప్రత్యేక పూజల్లో పాల్గొనాలంటే.. సంప్రదాయ దుస్తులు ధరించాల్సిందే**



**శ్రీకాకుళం, జూన్ 20 (వార్త):** అరసవల్లి సూర్యనారాయణ స్వామి దేవస్థానం ఆలయ కార్యనిర్వహణాధికారిగా ఈనెల 13న కేఎన్‌వీడీవీ ప్రసాదరావు బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆలయంలో సిబ్బంది, ఉద్యోగులను గాడిలో పెట్టేందుకు చర్యలు చేపట్టారు. ఆలయాభివృద్ధితో పాటు భక్తులకు మెరుగైన సదుపాయాల కల్పనకు దృష్టి సారించారు. అన్న ప్రసాద సత్రంతో పాటు ప్రసాదాల తయారీ, విక్రయం, గోశాలను తనిఖీ చేశారు. ఆలయంలో సిబ్బంది అవినీతికి పాల్పడినా, సమయపాలన పాటించకపోయినా, భక్తుల మనోభావాలకు దెబ్బతీసినా సహించేది లేదని హెచ్చరికలు జారీ చేయడంతో పాటు దినసరి వేతనదారుడిని తొలగించడంతో పాటు పారిశుధ్య ఉద్యోగికి అపరాధ రుసుం కూడా విధించి తన మార్క్‌ను ప్రదర్శించారు. ఆలయ ఆవరణలో ఉన్న ఇందపుష్కరిణితో పాటు ఆలయ పరిసరాలు, క్యూలైన్లను పరిశీలించారు.




### భక్తులకు.. ఇకపై అంతరాలయ దర్శనం:ఈవో

ఆరోగ్య ప్రదాత సూర్యనారాయణస్వామి ఆలయంలో ఇకపై భక్తులకు అంతరాలయ దర్శనం కల్పిస్తామని ఆలయ ఈవో కె.ఎన్.వి.డి.వి.ప్రసాద్ తెలిపారు. సోమవారం నుంచి శనివారం వరకూ ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం పదకుండున్నర గంటల వరకూ, సాయంత్రం మూడున్నర గంటల నుంచి ఆరు గంటల వరకూ రూ.100లు అంతరాలయ దర్శనం టిక్కెట్లు, అలాగే ప్రతి ఆదివారం రూ.300లకు టిక్కెట్లు భక్తులకు అందుబాటులో ఉంటాయన్నారు. భక్తులకు ప్రత్యేక క్యూలైను ద్వారా స్వామి వారి దర్శనానికి పంపిస్తామని తెలిపారు. ఆలయ అభివృద్ధి దృష్ట్యా ప్రధాన అర్చక స్వాములు సంప్రదింపులు తదుపరి కళ్యాణ రుసుములు, క్షీరాభిషెకం రుసుములు, సూర్యనమస్కారములు రుసుములు పెంపుదలపై సమాచారం అందిస్తామన్నారు. ఆలయ ఆస్తుల అభివృద్ధి పరిరక్షణకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ఆలయానికి సంబంధించి భక్తులకు సౌకర్యాల కల్పనే ధ్యేయంగా పనిచేస్తున్నానన్నారు ఉద్యోగులు కచ్చితంగా సమయపాలన పాటించాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించినా, అవినీతికి పాల్పడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇంద్ర పుష్కరిణి అభివృద్ధి కోసం ఇంజనీరింగ్ సిబ్బంది సేవలు అవసరమని, అందుకు తగిన చర్యలు ఇప్పటికే తీసుకున్నామని తెలిపారు. అలాగే స్వామివారి ప్రత్యేక పూజలైన క్షీరాభిషేకం, కళ్యాణం, సూర్యనమస్కారములు సేవలో పాల్గొనే భక్తులు తప్పనిసరిగా సాంప్రదాయ వస్త్రధారణలోనే రావాలన్నారు. పురుషులు పంచె, చొక్కా వేసుకోవాలని, మహిళలు చీర లేదా చుడీదార్‌తో వస్తేనే అనుమతి ఇస్తామన్నారు. భక్తులు ఈ విషయాలను గమనించి సహకరించాలని ఈవో కోరారు.

# అవినీతి దందాకు.. చెక్ పోస్టు

*** 2016లో పురుషోత్తపురం చెక్‌పోస్టుపై ఏసీబీ అధికారుల దాడి * పదేళ్ల విచారణకు తెర * పురుషోత్తపురం ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టులో అవినీతి ఆరోపణలు * 10 మంది అధికారులపై విచారణ * పలువురి ఇంక్రిమెంట్ల నిలిపివేత**

**శ్రీకాకుళం క్రైం, జూన్ 20 (వార్త):** జిల్లాలోని ఇచ్ఛాపురం మండలంలోని పురుషోత్తపురం చెక్‌పోస్టులో కొంతమంది అధికారులు వాహనదారుల నుంచి లంచాలు వసూలు చేస్తున్నారని వచ్చిన సమాచారంతో 2016 మార్చి 12న ఏసీబీ అధికారులు అకస్మాత్తుగా తనిఖీ జరిపారు. చెక్‌పోస్టులో కమర్షియల్ టాక్స్, ట్రాన్స్‌పోర్ట్, మార్కెటింగ్, ఎక్సైజ్, మైనింగ్ శాఖల ఉద్యోగులు వ్యవస్థను దుర్వినియోగం చేస్తూ ప్రభుత్వానికి నష్టం కలిగించినట్లు ఆరోపణలు వచ్చాయి. దీంతో 11మంది అధికారులపై శాఖాపరమైన చర్యలు ప్రారంభమయ్యాయి. పలువురిపై విచారణ జరిపారు. ఒక అధికారి మృతి చెందడంతో ఆయనపై కేసును తొలగించారు. మిగిలిన 10 మందిలో ముగ్గురిపై ఆరోపణలు నిరూపించలేకపోయారు. మిగిలిన ఏడుగురిలో ముగ్గురు అప్పటికే పదవీవిరమణ చేశారు. వారి పింఛన్లు నిలుపుదల చేసేందుకు సంబంధిత అధికారులు తగు చర్యలు చేపడుతున్నారు. కర్రి గౌరి శంకర్ రావు (జూనియర్ అసిస్టెంట్)పై వచ్చిన ఆరోపణ నిరూపితమవడంతో 'సెన్సర్' శిక్ష విధించారు. ఎ.రమణ (ఓఎస్)పై ఆరోపణలు నిరూపితమవడంతో ఒక ఇంటిగ్రేషన్ ఇంక్రిమెంట్‌ను , నక్క గోవింద రావు (అసిస్టెంట్ మార్కెట్ సూపర్వైజర్)పై ఒక ఆరోపణ నిరూపితమవడంతో ఇంక్రిమెంట్‌ను మొహమ్మద్ రహమాన్ అలీ (టెక్నికల్ అసిస్టెంట్ - మైన్స్ అండ్ జియాలజీ)పై ఆరోపణలు నిరూపితం కావడంతో ఒక ఇంక్రిమెంట్‌ను నిలిపివేశారు. రాజేశ్వరి (హెడ్ క్లర్క్), రాజెట్టి సుధీర్, ఉప్పు దుర్గాప్రసాద్ లపై ఆరోపణలు నిరూపణ కాలేదు. ఈ మేరకు రాష్ట్ర రెవెన్యూ (విజిలెన్స్) శాఖ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. గత దశాబ్దంగా సాగిన విచారణకు తెరపడినట్లు అధికార వర్గాలు తెలిపాయి.


ఫైల్ ఫోటో



## పాఠశాల భవనం కూలితే
# ఎవరిది బాధ్యత

*** పిల్లలను పాఠశాలకు పంపించేది లేదు * కొత్త భవనం నిర్మిస్తేనే పంపిస్తాం * కింజరాపువానిపేట పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు * గ్రామ రహదారిపై బైఠాయించి నిరసన**

**పోలాకి/శ్రీకాకుళం, జూన్ 20(వార్త):** పాఠశాల భవనం శిథిలావస్థకు చేరింది.. అందులోనే విద్యార్థులకు ఉపాధ్యాయులు బోధిస్తున్నారు.. ఆ భవనం కూలిపోయి.. మా పిల్లలకు ఏమైనా జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారు.. వేరే భవనం మార్చే వరకూ.. లేకుంటే కొత్త భవనం నిర్మాణం జరిగే వరకూ పిల్లలను పాఠశాలకు పంపేది లేదని పోలాకి మండలం కింజరాపువానిపేట గ్రామస్థులు ఖరాఖండిగా చెప్పేశారు. శుక్రవారం కింజరాపువానిపేట గ్రామస్థులు శుక్రవారం పాఠశాల సమీపంలోని రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. దీంతో గంటసేపు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. అనంతరం ఎమ్మార్సీ కార్యాలయంలో ఎంఈవో లింగరాజుకు వినతిపత్రం అందజేశారు. విద్యా కమిటీ అధ్యక్షుడు షణ్ముఖరావు మాట్లాడుతూ గ్రామానికి వచ్చిన ప్రతిసారీ కొత్త భవనం నిర్మిస్తామని నాయకులు హామీ ఇస్తున్నారే తప్ప పట్టించుకోవడం లేదన్నారు. ప్రస్తుతం తరగతులు నిర్వహిస్తున్న గదిలో రెండు రోజుల కిందట పిల్లల్ని కందిరీగలు కరిచాయన్నారు. ఈ సమస్యను పరిష్కరించే వరకూ పిల్లలను పాఠశాలకు పంపించబోమన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేస్తానని ఎంఈవో హామీ ఇవ్వడంతో వారంతా వెనుదిరిగారు.

## ఆదిత్యుడిని దర్శించిన మండపేట ఎమ్మెల్యే

**శ్రీకాకుళం, జూన్ 20(వార్త):** ప్రత్యక్ష దైవం, ఆరోగ్య ప్రదాత సూర్యనారాయణ స్వామి వారిని మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు శుక్రవారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర్ శర్మ, ఆలయ కార్య నిర్వాహణాధికారి ప్రసాద్ స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు వేద మంత్రాలతో ఆశీర్వదించారు. స్వామి వారి ప్రసాదాలను అందజేశారు.



# టీడీపీ అరాచకాలకు తప్పదు మూల్యం

**-ఆమదాలవలస వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ**

**సమన్వయకర్త చింతాడ రవికుమార్ హెచ్చరిక**



**సరుబుజ్జిలి, జూన్ 20(వార్త):** టీడీపీ నాయకులు గ్రామాల్లో తాము చేస్తున్న అరాచకాలకు భవిష్యత్తులో తప్పక మూల్యం చెల్లించుకుంటారని ఆమదాలవలస నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త చింతాడ రవికుమార్ అన్నారు. చిగురువలసలో ఇటీవల వైసీపీ కార్యకర్త జరుగుళ్ల రాజారావు నివాస గృహాన్ని కూల్చివేయడంతో రవికుమార్ శుక్రవారం ఆ కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ ఎమ్మెల్యే కూన రవికుమార్ ఇసుక, లిక్కర్, భూదందాలతో తన అక్రమ సంపాదన పెంచుకుంటున్నారని ఆరోపించారు. వైసీపీ నాయకులు, సానుభూతిపరులపై అక్రమ కేసులు, ఉద్యోగాలు, పెన్షన్లు తొలగించడం తప్ప ఈ నియోజకవర్గ ప్రజలకు ఒరిగిందేమీలేదన్నారు. ఇప్పటికైనా టీడీపీ నాయకులు కక్షపూరిత రాజకీయాలు మాని అభివృద్ధి కోసం పాటుపడాలని హితవు పలికారు. ఇలాంటి కవ్వింపు చర్యలకు పాల్పడితే భవిష్యత్తు పరిణామాలు చాలా తీవ్రంగా వుంటాయని హెచ్చరించారు. ఆయన వెంట జడ్పీటీసీ సభ్యుడు సురవరపు నాగేశ్వరరావు, మాజీ జేసీఎస్ కన్వీనర్ అత్తులూరి రవికాంత్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ కొవిలాపు శేఖర్, దకరవలస సర్పంచ్ సురవరపు తిరుపతిరావు, మెట్ట నందేసు, కెప్టెన్ రామారావు, చిగురువలస వైసీపీ నాయకులు చల్ల ఎర్రయ్య, పల్లి శాంతారావు, ముద్దాడ రంజిత్, దనాల చిరంజీవి, బేపల రవి, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## నిరుపయోగ బావుల పూడ్చివేత

**పలాస, జూన్ 20(వార్త):** బొడ్డపాడు గ్రామంలో కొనేన్నళ్ల నుంచి నిరుపయోగంగా ఉన్న బావులను శుక్రవారం పూడ్చారు. కార్యక్రమంలో బొడ్డపాడు యువజన సంఘం అధ్యక్షులు కిక్కిర ఢిల్లీ, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు దుస్తుల పంపిణీ



**శ్రీకాకుళం, జూన్ 20(వార్త):** భగవాన్ శ్రీ సత్యసాయిబాబా శత జయంతి సందర్భంగా శ్రీకాకుళం శ్రీ సత్యసాయి సేవా సమితి పెద్ద మందిరంలో నిర్వహిస్తున్న ఉచిత ట్యూషన్ సెంటర్ విద్యార్థులకు నూతన దుస్తులను వరం చారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ అంధవరపు ప్రసాద్, రిమ్స్ అన్నపూర్ణ ట్రస్ట్ అధ్యక్షులు గంగుల రమణ బాబు, జిల్లా శ్రీ సత్యసాయి సేవా సంస్థల అధ్యక్షులు సూర రామచంద్రరావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ శ్రీ సత్యసాయి సేవా సంస్థలు సమాజానికి అందిస్తున్న అనేక సేవలను కొనియాడారు. సంస్థ చేపట్టే సేవా కార్యక్రమాలకు తమ కుటుంబం ఎల్లప్పుడూ సహాయ సహకారాలు అందిస్తుందని తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా సేవా సమన్వయకర్త పప్పుల నాగేశ్వరరావు, స్కిల్ డెవలప్మెంట్ కన్వీనర్ కంబ మురళీకృష్ణ, శేఖర్, కృష్ణ, షణ్ముఖ, మహిళా సేవా దళ్ పాల్గొన్నారు.

# యోగాంధ్ర ఏర్పాట్లపై ఎమ్మెల్యే శంకర్ సమీక్ష



**శ్రీకాకుళం, జూన్ 20(వార్త):** అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం జరగబోయే యోగాంధ్ర కార్యక్రమం పై శుక్రవారం విశాఖ ఏ కాలనీలోని తన కార్యాలయంలో ఎమ్మెల్యే గొండు శంకర్ సమీక్ష ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చేందుకు అధికారులు సమష్టిగా పని చేయాలని సూచించారు. ఈ సమీక్షలో పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా, వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. జిల్లా ప్రత్యేక అధికారి, మున్సిపల్ కమిషనర్, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు పాల్గొని ఏర్పాట్లను వివరించారు. ప్రజల రవాణా, భోజన సదుపాయాలు, పార్కింగ్, స్టేజ్, వైద్య సహాయ కేంద్రాల ఏర్పాట్లపై సమీక్ష జరిపారు. ప్రతి ఒక్కరు సమన్వయంతో పనిచేసి యోగాంధ్రను విజయవంతం చేయాలని నిర్ణయించారు.

## పోర్టు పరిహారం ఇప్పించండి మహాప్రభో



**సంతబొమ్మాళి, జూన్ 20(వార్త):** మూలపేట పోర్టు నిర్మాణంతో సర్వస్వం కోల్పోయిన ఇంతవరకు ఎటువంటి పరిహారం ఇవ్వలేదని, ఆ పరిహారం ఇప్పించండి మహాప్రభో అంటూ విష్ణు చక్రం గ్రామానికి చెందిన దంపతులు గిన్ని ఈశ్వరరావు, మహాలక్ష్మి కోరారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. పీడీఎఫ్ లిస్టులో తమ పేరు ఉన్నా ఇంతవరకు పరిహారం ఇవ్వలేదని వాపోయారు. ఊర్లో అందరికీ ఇచ్చి తమను విస్మరించారని ఆవేదన వ్యక్తం చేశారు. అందరూ ఊరు ఖాళీ చేసి వెళ్లిపోతున్నారని, తాము ఈ ఊరిలో ఉండి ఏం చేయగలమని వాపోయారు. టెక్కలి ఆర్డీవో, కలెక్టర్ చుట్టూ తిరిగిన న్యాయం జరగలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పరిహారం ఇప్పించాలని వారు కోరారు.

# ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలి



**ఇచ్ఛాపురం, జూన్ 20(వార్త):** ఇచ్ఛాపురంలోని మండల విద్యా వనరుల కేంద్రంలో అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ఎంఈవోలు కురమాన అప్పారావు, ఎస్.విశ్వనాథం అధ్యక్షతన అత్యవసర సమావేశం నిర్వహించారు. పాఠశాల నిర్వహణ తదితర అంశాలను వివరించారు. ప్రతి ఉపాధ్యాయుడు నూతన విద్యార్థులను ఈనెల 25 లోగా ఆన్‌లైన్‌లో నమోదు తప్పనిసరిగా చేయాలని సూచించారు. సమయపాలన పాటించాలని సూచించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని సక్రమంగా నిర్వహించాలని, ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. వెనుకబడిన విద్యార్థులను ప్రత్యేక శిక్షణ అందించి వారిలో నైపుణ్యాన్ని మెరుగుపరచాలన్నారు. ప్రతి విద్యార్థికి కిట్లు అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామారావు ప్రత్యేక ఆహ్వానితులుగా విచ్చేసి శనివారం నిర్వహించే యోగాంధ్ర కార్యక్రమాన్ని ప్రతి పాఠశాలలో ఉదయం 6గంటల నుంచి 8గంటలవరకు నిర్వహించాలని కోరారు.

## వెన్నుపోటు పుస్తకావిష్కరణ.

**కొత్తూరు, జూన్ 20(వార్త):** కొత్తూరులోని డా.వైస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం వద్ద శుక్రవారం వైస్సార్సీపీ మండలనాయకులు కూటమి పాలనపై 'వెన్నుపోటు' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజల్లో అసంతృప్తి నెలకొందన్నారు. పాలనపై, ఇచ్చిన హామీలపై ఎవరు మాట్లాడినా కేసులు బనాయిస్తున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుండి అరాచకాలు, మహిళలు, యువతులు, చిన్నారులపై అకృత్యాలు పెరిగాయన్నారు. గత ప్రభుత్వ పాలనకు, ప్రస్తుత పాలనకు ప్రజలు తేడా గమనిస్తున్నారన్నారు. రాష్ట్రంలో రైతులు, అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతుంటే సుపరిపాలన అందిస్తున్నామంటూ ప్రగల్భాలు చెప్పుకోవడం దారుణమని విమర్శించారు. కార్యక్రమంలో ఎంపీపీ సవర సావిత్రి, మండల కన్వీనర్ గండివలస ఆనంద్, చింతాడ సూర్యనారాయణ, పారాపురం ఎంపీటీసీ సభ్యుడు వణుము లక్ష్మీనారాయణ, సర్పంచ్ ధర్మారావు, బాలకృష్ణ, ధూళి అప్పన్న, ఎ.నాగేశ్వరరావు, సర్పంచ్ రంజిత్, కార్యకర్తలు పాల్గొన్నారు.



# సారా కోసం నల్లబెల్లం విక్రయిస్తే చట్టపరమైన చర్యలు



**పలాస, జూన్ 20(వార్త):** వ్యాపారులు నాటుసారా కోసం నల్లబెల్లం విక్రయిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ పైడి రామచంద్రరావు హెచ్చరించారు. పలాస ఎక్సైజ్ కార్యాలయంలో పలాసకాశీబుగ్గ ఉన్న వ్యాపారులతో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటుసారా రహిత ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దేందుకు సహకరించాలని కోరారు నల్లబెల్లాన్ని ఎవరూ విక్రయించకూడదని, ఎవరైన నల్లబెల్లం కోసం వస్తే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. బెల్లం వ్యాపారస్తులు బీఎన్ఎస్ఎన్ యాక్టు కింద బైండోవర్ కోరారు. సమావేశంలో అసిస్టెంట్ సూపరెండెంట్ ఎం.గోపాలకృష్ణ, వలస ఎక్సైజ్ సీఐ మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## భవిత కేంద్రంలో ఫిజియోథెరపీ

**ఇచ్ఛాపురం, జూన్ 20(వార్త):** ముత్యాలమ్మ పేటలో ఉన్న భవిత కేంద్రంలో 15 విద్యార్థులకు ఫిజియోథెరపీ సేవలు నిర్వహించారు.

కార్యక్రమంలో ఫిజియోథెంపిస్ట్ బి.అమూల్య, ఉపాధ్యాయులు టి.శివకుమార్, సహిత ఉపాధ్యాయులు సూర్యం, హెచ్.సోమేష్ పాల్గొన్నారు.





## రైతులకు విత్తనాలు, పరికరాల పంపిణీ

**శ్రీకాకుళం, జూన్ 20(వార్త):** ఏరువాక పౌర్ణమి సందర్భంగా ఎమ్మెల్యే గొండు శంకర్ శుక్రవారం ఒప్పంగి గ్రామంలో రైతులతో కలిసి విత్తనాలు నాటారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు రాయితీపై వరి విత్తనాలు, వ్యవసాయ పరికరాలను పంపిణీ చేశారు. 50శాతం సబ్సిడీపై పశువుల దాణాను లబ్ధిదారులకు అందజేశారు. వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే తెలిపారు. రైతులు ఆధునిక పద్ధతుల్లో సాగు చేయాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, స్థానిక కూటమి నాయకులు, కార్యకర్తలు, రైతులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## నవోదయం 2.0 పై ప్రచారం చేయండి



**ఇచ్ఛాపురం, జూన్ 20(వార్త):** నవోదయం2.0పై విస్తృతంగాగ్రామాల్లో ప్రచారం చేయాలని ఎక్సైజ్ డిప్యూటీ కమిమిషనర్ డి.శ్రీకాంత్ రెడ్డి కోరారు. శుక్రవారం ఆయన ఇచ్ఛాపురం ఎక్సైజ్ స్టేషన్, పురుషోత్తపురం చెక్‌పోస్టును తనిఖీ చేశారు. ఒడిశా నాటు సారా, మద్యం, గంజాయి అక్రమ రవాణా అరికట్టాలని ఆదేశించారు. ఈ పర్యటనలో సీఐ పి.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

## ఇచ్ఛాపురం టీడీపీ ఉపాధ్యక్షుడిగా కృష్ణయ్య

**ఇచ్ఛాపురం, జూన్ 20(వార్త):** ఇచ్ఛాపురం పట్టణ తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడిగా తొమ్మిదో వార్డు ఇన్‌చార్జి బత్తిన కృష్ణయ్య చౌదరిని నియమించారు. ఈ మేరకు పట్టణ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ప్రకటించారు. ఐదుగురు కార్యదర్శులు, కోశాధికారి, ఇతర సభ్యులను నియమించారు. తనకు పార్టీ పదవి లభించడంపై ప్రభుత్వ విప్ బెందాళం అశోక్, పార్టీ నాయకులు, కార్యకర్తలకు కృష్ణయ్య చౌదరి కృతజ్ఞతలు తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మున్సిపాలిటీలో పార్టీ జెండా ఎగుర వేస్తామన్నారు. తనపై పార్టీ పెట్టుకున్న నమ్మకంతో విధేయుడిగా పని చేస్తానన్నారు.



## వైభవంగా లక్ష్మీ గణపతి ఆలయ వార్షికోత్సవం



**సంతబొమ్మాళి, జూన్ 20(వార్త):** నౌపడ గ్రామం టెక్కలి వీధిలో గల లక్ష్మీ గణపతి ఆలయం వార్షికోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. వేద పండితులు బరాడ విశ్వగురు శర్మ, విధాత నాగేశ్వర శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, లక్ష్మీ గణపతి హెూమాలు ఘనంగా జరిపారు. దుర్గారావు బాబ్జీ, లక్ష్మీ దంపతులు ఈ పూజల్లో పాల్గొన్నారు. స్వామివారికి మహా హెూమం, పూర్ణాహుతి సమర్పించి, మహా హారతి నివేదించారు. భక్తులకు ప్రసాద వితరణ గావించారు. నిరుపేదలకు దుస్తులు పంపిణీ చేశారు.





# ఎస్‌బీఐ ఉద్యోగుల మెగా రక్తదానం

**-జిల్లా వ్యాప్తంగా 200 యూనిట్ల సేకరణ**

**శ్రీకాకుళం, జూన్ 20(వార్త):** స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్థాపించి 70 ఏళ్లు పూర్తయిన సందర్భంగా, బ్యాంకు చైర్మన్ పిలుపు మేరకు శ్రీకాకుళం రీజనల్ ఆఫీస్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేశారు. శ్రీకాకుళం రీజియన్ పరిధిలో 200 యూనిట్లకు పైగా బ్యాంకు ఉద్యోగులు రక్తదానం చేశారు. శ్రీకాకుళం, పలాస, సోంపేట, కంచలి క్లస్టర్లలో రక్తదాన శిబిరాలు నిర్వహించి, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీకి అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎస్బీఐ మేనేజర్ ఉదయకుమార్ సింగ్, రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహన్, రెడ్‌క్రాస్ ప్రతినిధులు పెంకి చైతన్యకుమార్, కె.సత్యనారాయణ, జి.రమణ, ఎస్బీఐ ఆఫీసర్స్ అసోసియేషన్ కామ్రేడ్ కిషోర్, స్టాఫ్ యూనియన్ రీజనల్ సెక్రటరీ కామ్రేడ్ వెంకటరమణ పాల్గొన్నారు. జిల్లాలోని అన్ని బ్రాంచిల్లో కల్ సెక్రటరీస్, ఉద్యోగులు భారీగా పాల్గొని రక్తదానం చేశారు. ఎస్బీఐ స్టాఫ్ యూనియన్ ఫౌండర్ కామ్రేడ్ తారకనాథ్ వర్ధంతిని పురస్కరించుకొని, అమరావతి సర్కిల్ జనరల్ సెక్రటరీ కామ్రేడ్ ఎల్.చంద్రశేఖర్ పిలుపు మేరకు అనేక మంది ఉద్యోగులు ఈ శిబిరాల్లో రక్తదానం చేశారు.









**ఇచ్ఛాపురం, జూన్ 20(వార్త):** అమరావతి సర్కిల్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టాఫ్ యూనియన్ ఆధ్వర్యంలో కామ్రేడ్ తారక్ నాథ్ జయంతి సందర్భంగా కంచిలి స్టేట్ బ్యాంక్ కార్యాలయ ఆవరణలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఇచ్ఛాపురం వీకే పేట, పంజా వీధి, శిలగాం బ్రాంచ్‌ల సిబ్బంది రక్తదానం చేశారు. కార్యక్రమం లో యర్రా గౌరీశంకర్, కాతిల ప్రసాద్ రెడ్డి, కుండల రాజేష్, సమదర్శి, యర్ర బాబూరావు, మురళీమోహన్, లీలాప్రసాద్, మార్పు సాయిసింధు తదితరులు పాల్గొన్నారు.

# యోగా సాధనతో ఆరోగ్యం






**ఇచ్ఛాపురం, జూన్ 20(వార్త):** యోగా గురువు జి.కామరాజు ఆధ్వర్యంలో అలయన్స్ క్లబ్ క్లబ్ అధ్యక్షులు లోపింటి నరసింహమూర్తి పర్యవేక్షణ లో శుక్రవారం యోగాసనాలపై శిక్షణ ఇచ్చారు. మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్, జనసేన నియోజకవర్గ నాయకులు దాసరి రాజు హాజరై ఆ సంస్థ సభ్యులను అభినందించారు. పతంజలి యోగా గురువు సంజీవ రెడ్డి, మున్సిపల్ సిబ్బంది, పెద్దఎత్తున యవకులు మహిళలు, పిల్లలు, క్లబ్ ప్రతినిధులు డి.గోపి, లక్ష్మణ్, లోహిదాస్, బి.వెంకటరమణ, కాళ్ల నరసింహ, యోగి, ప్రకాష్, బాలకృష్ణ, రవి, తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యోగాంధ్ర 2025లో భాగంగా శుక్రవారం విద్యార్థులు యోగాసనాలు వేశారు. యోగాతో మానసిక, శారీరకంగా ఆనందంగా ఉండొచ్చని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రోబిన్ కుమార్ పాడి తెలిపారు.

కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రావు, అధ్యాపకులు దుర్యోధన, శివకుమార్, సీతమ్మ, సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

# అక్రమ కట్టడాలపై కేసులు నమోదు చేయండి

**-మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు**

**పలాస, జూన్ 20(వార్త):** పలాస పురపాలక సంఘంలోని అక్రమ కట్టడాలను గుర్తించి, కేసులు నమోదు చేయాలని పలాస-కాశీబుగ్గ మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు కోరారు. శుక్రవారం ఆయన అన్ని సచివాలయంల ప్లానింగ్ కార్యదర్శులతో కలసి మున్సిపల్ టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫార్మ్‌ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఈ పురపాలక సంఘంలో ఇంటి నిర్మాణం చేస్తున్న గృహ యజమానులను గుర్తించి ప్రతి వారితో కూడా బిల్డింగ్ అప్లికేషన్లు పెట్టించి, వారికి బిల్డింగ్ ప్లాన్ అప్రూవల్ పై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో పురపాలక సంఘ పరిధిలోని అన్ని సచివాలయంల ప్లానింగ్ కార్యదర్శులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



## 23 న జిల్లా కలెక్టరేట్ వద్ద వైసీపీ ధర్నా



**శ్రీకాకుళం, జూన్ 20(వార్త):** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నిరుద్యోగుల పక్షాన నిలుస్తూ కూటమి సర్కారుపై యువజన విభాగం ఆధ్వర్యంలో నిరసన గళం ఈ నెల 23న వినిపిస్తుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ తెలిపారు. శుక్రవారం ఆయన జిల్లా పార్టీ కార్యాలయంలో విలేఖరులతో మాట్లాడారు. అన్ని నియోజకవర్గాల నుంచి యువత అధిక సంఖ్యలో హాజరై, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# ప్రజా సేవకు ప్రతిరూపం రెవెన్యూ శాఖ




**శ్రీకాకుళం, జూన్ 20(వార్త):** రెవెన్యూ శాఖ అనేక మార్పులకు పునాదిరాయిగా నిలిచిందని, ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందిస్తోందని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. రెవెన్యూ డే సందర్భంగా శ్రీకాకుళంలోని బాపూజీ కళా మందిరంలో శుక్రవారం జిల్లా రెవెన్యూ ఉద్యోగులు నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. భూ పరిపాలన నుంచి అన్ని ప్రభుత్వ కార్యక్రమాలకు రెవెన్యూ శాఖ మూలస్తంభంగా నిలుస్తోందన్నారు. 1786 జూన్ 20న బోర్డ్ ఆఫ్ రెవెన్యూ ఏర్పాటు కాగా, ప్రతి ఏడాది రెవెన్యూ డేగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. బడుగు, బలహీనవర్గాలకు ప్రభుత్వ సేవలను అందించడంలో రెవెన్యూ ఉద్యోగుల పాత్ర అమోఘమని కొనియాడారు. ఈ సందర్భంగా సంవత్సరాలుగా రెవెన్యూశాఖలో సేవలందించిన రిటైర్డ్ ఉద్యోగులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కంచరాన శ్రీరాములు, కలెక్టరేట్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బెవర పద్మావతి, అసోసియేషన్ ప్రతినిధులు ప్రవల్లిక, రాజు, చంద్రశేఖర్, లింగరాజు, ధర్మాన ప్రకాష్, చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

**శ్రీకాకుళం, జూన్ 20(వార్త):** రెవెన్యూ డే సందర్భంగా శుక్రవారం శ్రీకాకుళంలోని రెవెన్యూ గెస్టు హౌస్‌లో జిల్లా రెవెన్యూ సర్వీసుల సంఘం అధ్యక్షుడు కె.శ్రీరాములు జెండా వందనం గావించారు. ఈ సందర్భంగా రెవెన్యూ సర్వీసుల సంఘ పెద్దలు, రిటైర్డ్ రెవెన్యూ ఉద్యోగులను సన్మానించారు. కార్యక్రమంలో రిటైర్డ్ రెవెన్యూ ఉద్యోగుల సంఘ కార్యదర్శి డి.చంద్రశేఖర్, పూర్వపు అధ్యక్షుడు ఎంవీ సూర్యనారాయణ, ఎం.కాళీప్రసాద్ గారు, ఏపీ జేఏసీ అమరావతి మహిళా విభాగం అధ్యక్షురాలు కె.ప్రవల్లిక ప్రియ, రాష్ట్ర కార్యదర్శి పి.శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి బి.వి.వి.ఎన్. రాజు, ట్రెజరర్ మురళీధర్ నాయక్, సోని కిరణ్, జికె శ్రీనివాసరావు, ప్రకాశరావు, శాస్త్రి, రాంజీ, ఢిల్లేశ్వరరావు, జి.వెంకటప్పారావు, అప్పలనాయుడు, రామారావు, త్రినాథ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.






**ఇచ్ఛాపురం, జూన్ 20(వార్త):** ఇచ్ఛాపురంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం రెవెన్యూ డే వేడుకలు నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ బలివాడ శ్రీవారి రైతులకు పత్రాలను అందించారు. ప్రజా సమస్యల వేదిక ద్వారా 2285 అర్జీలు వచ్చాయని, ఇందులో 1503 అర్జీలు పరిష్కరించామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో డీటీ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

### రెవెన్యూ ఉద్యోగులకు ఘన సన్మానం

**పలాస, జూన్ 20(వార్త):** రెవెన్యూ దినోత్సవం సందర్భంగా పలాస తహసీల్దార్ కార్యాలయంలో ఇన్‌చార్జి తహసీల్దార్ వాయిలపల్లి గిరిబాబు ఆధ్వర్యంలో ఉత్తమ సేవలందించిన రెవెన్యూ అధికారులకు శుక్రవారం కార్యాలయ ఆవరణలో సన్మానించారు. ఈ సందర్భంగా గిరిబాబు మాట్లాడుతూ ప్రభుత్వంలో రెవెన్యూ శాఖ ఎంతో కీలకమైనదన్నారు. కార్యక్రమంలో ఆర్ఐలు ఖగేశ్వరరావు, ప్రసాదరావు, సర్వేయర్ గిరి, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# పీఎం జుగా సేవలను వినియోగించుకోవాలి



**కొత్తూరు, జూన్ 20(వార్త):** పీఎం జుగా సర్వే ద్వారా ప్రజలకు మరిన్ని సేవలు అందుతాయని, వాటిని వినియోగించుకోవాలని ఐటీడీఏ ఏపీవో జి.చిన్నబాబు సూచించారు. శుక్రవారం అల్తి గ్రామంలో పీఎం జుగా గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీవో మాట్లాడుతూ పీఎం జుగా సర్వే ద్వారా గుర్తించిన వివిధ రకాల ప్రజల సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఈ సందర్భంగా పీఎం జుగా ద్వారా అందే సేవలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇప్పటివరకు ఆధార్ కార్డులు, రేషన్ కార్డులు, హెల్త్ కార్డ్స్, బర్త్ సర్టిఫికెట్లు లేనివారు, గ్యాస్ కనెక్షన్ లేనివారు, బ్యాంకు అకౌంట్లు లేనివారు పీఎం జుగా సర్వే ద్వారా ఆయా శాఖల వద్ద పొందవచ్చని అన్నారు. ఈనెల 30వరకు ఎంపిక చేసిన గిరిజన గ్రామాల్లో ఈ గ్రామసభలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. ఐటీడీఏ పరిధిలోని రెండు జిల్లాల్లో కలిపి 88 గ్రామాల్లో పీఎం జుగా గ్రామసభలు నిర్వహిస్తామన్నారు. దీనిలో పార్వతీపురం మన్యం జిల్లాకు సంబంధించి 54 గిరిజన గ్రామాలు, శ్రీకాకుళం జిల్లాలో 34 గిరిజన గ్రామాలను ఎంపిక చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐటీడీఏ డీడీ అన్నదొర, కొత్తూరు ఎంపీడీవో వి.నీరజ, మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546